క్లుప్తంగా

రైతు ఆగ్రో సేవా కేంద్రం తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ బాల్‌రెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఫర్టిలైజర్ దుకాణాల్లో ప్రభుత్వ అనుమతులు ఉన్న ఎరువులు, విత్తనాలనే విక్రయించాలని, నకిలీ విత్తనాలు అమ్మితే చర్య తప్పదని మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన చిలప్‌చెడ్‌లోని రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని విత్తనాలు, తదితర స్టాక్ పరిశీలించడంతో పాటు, రికార్డులు తనిఖీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భూపాల్, రైతు ఆగ్రో సేవా కేంద్రం నిర్వాహకుడు శ్రీనివాస్ ఉన్నారు.

ఆహ్వానం



ప్రభాకర్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న నిర్వాహకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గూడూర్ గ్రామంలో నెలకొల్పనున్న శ్రీ గురుపీఠం శిలాన్యాసంకు హాజరు కావాలని బుధవారం పలువురు ప్రముఖులకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. శ్రీ గురుపీఠం వ్యవస్థాపకులు శివకుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేలు సునీతారెడ్డి, కొత్త ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలతో పాటు పలువురిని కలిసి ఆహ్వానించారు. గురువారం శ్రీ గురుపీఠం శిలాన్యాసం నిర్వహిస్తున్నట్లు శివకుమార్‌గౌడ్ తెలిపారు. అందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ విశ్వయోగి విశ్వంజీ మహారాజ్ హాజరుకానున్నారు. ఈ కార్యక్రమంలో బగలాముఖీ ఉపాసకులు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, శ్రీ గురుపీఠం ట్రస్టు సభ్యులు మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రమణగౌడ్, తదితరులు ఉన్నారు.

విద్యుత్ మీటర్ల తనిఖీ



మీటర్లను తనిఖీ చేస్తున్న అధికారులు

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలో విద్యుత్‌శాఖ అధికారులు బుధవారం 13 బృందాలుగా ఏర్పడి గ్రామంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు మాట్లాడుతూ.. గ్రామంలోని ఇంటింటికీ ఉన్న విద్యుత్ మీటర్లను తనిఖీ చేశారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి అనధికార విద్యుత్ వినియోగం చేసినట్లయితే కేసు నమోదు చేసి, అపరాధ రుసుం వసూలు చేస్తామని వినియోగదారులను హెచ్చరించారు.

మౌలిక సదుపాయాలను నమోదు చేయాలి



శిక్షణలో ఉపాధ్యాయులు

మనోహరాబాద్(తూప్రాన్): ఈ విద్యాసంవత్సరానికి సంబంధించిన పాఠశాల మౌలిక సదుపాయాల వివరాలను యూడైస్‌లో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని నోడల్ అధికారి వెంకటస్వామి అన్నారు. బుధవారం మండలం కాళ్లకల్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. మండల ఉపాధ్యాయులకు రిసోర్స్ పర్సన్‌లతో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ.. తమ పాఠశాలలకు సంబంధించిన మౌలిక వసతులను, సమస్యలను, విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో ఈ నెల 12లోపు నమోదు చేయాలన్నారు. నమోదు ఆధారంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత

మిరుదొడ్డి(దుబ్బాక): మండల కేంద్రమైన మిరుదొడ్డిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నిరుపేద వేముల మల్లవ్వ కుటుంబాన్ని బీఆర్‌ఎస్ నాయకులు బుధవారం పరామర్శించి 75 కిలోల బియ్యాన్ని అందించారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, ఉప సర్పంచ్ ముక్కపల్లి కనకయ్య, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ చందపురం మల్లేశం, టౌన్ ప్రెసిడెంట్ ధర్మారం బాబు, నాయకులు కనకయ్య, కిష్టయ్య పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదు

- చిలప్‌చెడ్ మండల సమావేశంలో సభ్యుల ఆగ్రహం



మాట్లాడుతున్న ఎంపీపీ వినోదరెడ్డి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వైకుంఠధామాల్లో విద్యుత్ కనెక్షన్ల కోసం డబ్బులు చెల్లించినా.. విద్యుత్ కనెక్షన్ల ఇవ్వడం లేదని మండల సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మండల కేంద్రం చిలప్‌చెడ్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వినోదరెడ్డి అధ్యక్షతన, ఎంపీడీఓ శశిప్రభ సమక్షంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఆర్‌పీ రాజశేఖర్ మాట్లాడుతూ.. మండలంలో 11 పాఠశాలలకు 9 పాఠశాలలో మన ఊరు - మన బడి పనులు జరుగుతుండగా, అజ్జమర్రిలో పాఠశాల పూర్తిస్థాయిలో, మరో ఎనిమిది పాఠశాలల్లో 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. విద్యార్థులకు నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశామన్నారు. ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. చిట్కుల్, కేజీబీవీ విద్యార్థులకు 10వ తరగతి పరీక్షలు రాసేందుకు మండలంలో సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో 9 రైతుబీమా దరఖాస్తులు అందగా, 5 మంది రైతులకు బీమా వచ్చిందని, మరో 4 పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఈ సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యుత్‌శాఖ సబ్ ఏఈ సల్మాన్ మాట్లాడుతూ.. మండలంలో మండలంలో చాలా వరకు విద్యుత్ సమస్యలు పరిష్కరించామన్నారు. కాగా పలువురు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. పలు గ్రామాల వీధుల్లో పగలు లైట్లు వెలుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. పెరటి కోళ్ల పెంపకానికి డీడీలు కట్టి సంవత్సరం దాటినా.. ఇప్పటి వరకు కోళ్లు రాలేదని వెటర్నరీ అసిస్టెంట్ సురేశ్‌ను సర్పంచ్‌లు ప్రశ్నించారు. పీఆర్‌ఏఈ మధుబాబు మాట్లాడుతూ.. మండలంలో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. కాగా పలు సర్పంచ్‌లు మాట్లాడుతూ.. పోలింగ్ బూత్‌ల మౌలిక సదుపాయాలు ఖర్చు డబ్బులు ఎప్పుడు వస్తాయని అడిగారు. గ్రామాల్లో సక్రమంగా నీళ్లు రాకపోవడంపై అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జగ్గంపేట సర్పంచ్ మాంతప్ప అన్నారు. కబ్జాలు, అలుగుల పారకం, తదితర విషయాలపై సర్పంచ్‌లకు ఎలాంటి అధికారాలు ఉండవని, ఇరిగేషన్ అధికారులే వాటిని సంరక్షించాలని సర్పంచ్‌లు అన్నారు. ఏపీఓ శ్యాంకుమార్ మాట్లాడుతూ.. ఉపాధిహామీలో మండల వ్యాప్తంగా 38 కుటుంబాలు 100 రోజులు పని చేశారన్నారు. నర్సరీ పనులు ప్రారంభమయ్యాయని, విత్తనాలు తెప్పించాల్సి ఉందన్నారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటు డబ్బులు రాలేదని పలువురు సర్పంచ్‌లు ప్రశ్నించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోషిమాత మాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకం గ్రామంలో ఉన్న వారికే వర్తిస్తుందని, దత్తత కార్యక్రమం ఏదైనా ఉంటే చట్టపరంగా చేసుకోవాలన్నారు. నర్సాపూర్ ఆర్టీసీ డిపో పీఆర్‌ఓ మాట్లాడుతూ.. మండలంలో బస్సు సర్వీసులు సక్రమంగా నడుస్తున్నాయని అనగా, వైస్ ఎంపీపీ విశ్వంభర అడ్డుకుని సోమక్కపేట్, గౌతాపూర్ గ్రామాలకు బస్సు రావడంలేదని, ఎప్పుడో ఒకసారి వచ్చిన అది సమయం ప్రకారం రావడంలేదని, ఈ విషయంపై తగిన చర్య తీసుకోవాలన్నారు. ఎంపీపీ వినోదరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు తప్పనిసరిగా ప్రజల సమస్యలు తీర్చేలా తమ విధులు నిర్వహించాలని తెలిపారు. ఎంపీడీఓ శశిప్రభ సభను 40 నిమిషాల్లో సర్వసభ్య సమావేశాన్ని ముగించేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ముసాద్దిక్ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అన్వేష్ రెడ్డి, ఏపీఎం ప్రేమలత, ఆయా శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం



నర్సాపూర్‌లో అయ్యప్ప భక్తులతో ఎమ్మెల్యే సునీతారెడ్డి



సునీతారెడ్డికి ఆహ్వాన పత్రిక అందిస్తున్న గ్రామస్తులు

నర్సాపూర్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి అయ్యప్ప మాలధారులతో కలిసి పూజలు చేశారు. అనంతరం నిర్మాణంలో ఉన్న ఆలయ పరిసరాలు ఆమె అయ్యప్పస్వాములతో కలిసి పరిశీలించారు. ఆయన నిర్మాణ పనులు నిలిచాయని మాలధారులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాగా ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణం ప్రారంభించినప్పుడు తాను తన వంతు సహకారం అందించానని తెలిపారు. అనంతరం అయ్యప్ప మాలధారులు, బీఆర్‌ఎస్ నాయకులు అశోక్‌గౌడ్, నాగరాజు, భిక్షపతి, బాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, జ్ఞానేశ్వర్, నగేశ్, శ్రవణ్‌కుమార్, ప్రకాష్ తదితరులు ఆమెను సన్మానించారు.

ఎదుల్లాపూర్‌లో గ్రామ దేవతల ఉత్సవాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని ఎదుల్లాపూర్ గ్రామంలో నేటి నుంచి గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని సర్పంచ్ కీర్తనహన్మంత్‌రావు తెలిపారు. ఈ నెల 7 నుంచి 11 వరకు గ్రామ దేవతల ఉత్సవాల్లో భాగంగా బొడ్రాయి, లింగమయ్యల ప్రతిష్ఠ, బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాలకు హాజరు కావాలని సునీతారెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హరికృష్ణ, గ్రామస్తులు జైపాల్‌రెడ్డి, వెంకటేష్, మహేందర్‌రెడ్డి, సునందరెడ్డి, పాండురంగం, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, రాజు ముత్యాలు ఉన్నారు.

కౌడిపల్లి(నర్సాపూర్): కుమ్మర సంఘం నాయకులు ఎమ్మెల్యే సునీతారెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం నర్సాపూర్ నియోజకవర్గ కుమ్మర సంఘం ప్రచార కార్యదర్శి గంగయ్య ఆధ్వర్యంలో సంఘం నాయకులు లక్ష్మణ్, మల్లేశం, నగేశ్ తదితరులు ఆమెను కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

రసాయన ఎరువుల నుంచి భూమిని కాపాడుదాం



రైతులకు అవగాహన కల్పిస్తున్న కంపెనీ ప్రతినిధులు

కొల్చారం(నర్సాపూర్): రసాయన ఎరువుల నుంచి భూమిని కాపాడడం ద్వారా మానవాళికి మేలు కలుగుతుందని ఎస్‌ఎంసీ కంపెనీ ప్రతినిధి సుధాకర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోతంశెట్టిపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో మండల వ్యవసాయ శాఖ సౌజన్యంతో ప్రపంచ మృతిక దినోత్సవాన్ని నిర్వహించారు. భూ సారాన్ని పెంచేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా భూమిలో సారం పెరిగి పంట దిగుబడికి ఎక్కువ అవకాశాలు ఉంటాయన్నారు. రహసాయన ఎరువులు మృతికలోని సహజత్వాన్ని కోల్పోయేలా చేయడంతో పాటు పంట దిగుబడులపై ప్రభావాన్ని చూపుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకొని పంట సాగులో సేంద్రియ ఎరువుల వాడకాన్ని పెంచాలన్నారు. పంటల దిగుబడికి అవసరమైన సూచనలు ఇచ్చారు. ఈ సదస్సులో ఏఈఓ ప్రతిభ, రైతులు పాల్గొన్నారు.

సీఎంగా రేవంత్‌రెడ్డితో పేదలకు మేలు

చిన్నశంకరంపేట(మెదక్): తెలంగాణ సీఎంగా రేవంత్‌రెడ్డితోనే కాంగ్రెస్ ఆరు గ్యారంటీల అమలు జరుగుతుందని ఓయూ జేఏసీ నాయకులు హలావత్ మోహన్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలను నేరవేర్చడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మేలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ సీఎల్‌పీ నేతగా ఎన్నుకోబడి సీఎంగా ప్రమాణ స్వీకారం చేయనున్న రేవంత్‌రెడ్డిని ఆయన అభినందించారు.

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

కౌడిపల్లి(నర్సాపూర్): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో పాటు రేవంత్‌రెడ్డి సీఎంగా గురువారం ప్రమాణస్వీకారం చేస్తుండటంతో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేశారు. టపాసులు పేల్చి, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.



కాంగ్రెస్ నాయకుల సంబరాలు

ప్రతీ హామీని నెరవేరుస్తాం

- పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్



మాట్లాడుతున్న పీసీసీ సభ్యుడు కిషన్

రేగోడ్(మెదక్): ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేరుస్తామని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి అన్నారు. మండల కేంద్రం రేగోడ్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పదేళ్ల కష్టానికి ప్రతి ఫలంగా తీర్పు వచ్చిందని, ఇది ప్రజా విజయమని తెలిపారు. దామోదర రాజనర్సింహను భారీ మెజార్టీతో గెలిపించిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దిగంబర్‌రావు నేతృత్వంలో అంత సమష్టిగా పని చేయడం వలన అన్ని గ్రామాల్లో మెజార్టీ వచ్చిందని చెప్పారు. ఇక అభివృద్ధే తమ లక్ష్యమని, ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాధకిషన్, మాజీ సర్పంచ్ విజయభాస్కర్, మాజీ ఎంపీటీసీ నరేందర్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్స్‌లో ఉచిత శిక్షణ

కౌడిపల్లి(నర్సాపూర్): మహిళలకు స్వయం ఉపాధి కోసం బ్యూటీ పార్లర్ కోర్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు మండల ఐకేపీ ఏపీఎం సంగమేశ్వర్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో నెలరోజుల పాటు మహిళలకు బ్యూటీ పార్లర్ కోర్స్‌పై ఉచిత శిక్షణ ఇస్తున్నారని అన్నారు. మెదక్, సంగారెడ్డి జిల్లాలకు చెందిన 18 నుంచి 45ఏళ్ల లోపు మహిళలకు అర్హులని తెలిపారు. ఈనెల 15 నుంచి వచ్చే నెల 13 వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి బ్యూటీపార్లర్ టూల్ కిట్ అందజేస్తామన్నారు. ఉత్సాహం ఉన్నవారు రేషన్, ఆధార్‌కార్డు, పదవ తరగతి మెమో బ్యాంక్ అకౌంట్ జిరాక్స్ పత్రాలతో పాటు నాలుగు పాస్‌ఫొటోలతో ఈనెల 14వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు 97044 46956, 94901 29839 సంప్రదించాలని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో భక్తులు

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని రంగంపేటలో గురుస్వామి కామిని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితుల వేదమంత్రోచరణల మధ్య అయ్యప్ప మహాపడిపూజ బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక పూజ, అనంతరం 18 కలశాలకు పూజ నిర్వహించారు. పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాల నుంచి అయ్యప్ప స్వాములు, భక్తులు వచ్చారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి హరిదాస్, స్వాములు పాల్గొన్నారు.

ముసురు వర్షం

శివ్వంపేట(నర్సాపూర్): రెండు రోజుల నుంచి మిచౌంగ్ తుపాను కారణంగా మండల వ్యాప్తంగా మబ్బులు కమ్ముకోవడంతో ముసురుతో కూడిన వర్షం కురిసింది. తీవ్ర చలి ప్రభావంతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చేతికి వచ్చిన ధాన్యం ఆరబోసిన రైతులు ఎండ లేకపోవడంతో ధాన్యం పాడైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన శివ్వంపేటలో బుధవారం ముసురు వర్షంలోనే సంత జరిగింది.



శివ్వంపేటలో ముసురు వర్షంలో సంత

మైనంపల్లిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నేరవేరుస్తుందని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట మండల కాంగ్రెస్ నాయకులు ఆయన నివాసంలో కలిసి మెదక్ ఎమ్మెల్యేగా మైనంపల్లి రోహిత్ గెలుపుపై అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మైనంపల్లి హన్మంతరావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదప్రజలకు మేలు చేసే ఆరు గ్యారంటీల అమలుకు ప్రత్యేక శ్రద్ధతో ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మిర్జాపల్లి మాజీ సర్పంచ్ పోతరాజ్ జనార్దన్, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రామచంద్రం, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లేశం, సాయిలు ఉన్నారు.

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని కలిసిన నాయకులు

చేగుంట(తూప్రాన్): దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని బీఆర్‌ఎస్ నాయకులు హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ప్రభాకర్‌రెడ్డిని బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపినట్లు బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు కిషన్‌రావు తెలిపారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మంచికట్ల శ్రీనివాస్, రైతు సమన్వయ కమిటీ జిల్లా డైరెక్టర్ మోహన్‌రెడ్డితో పాటు పలు గ్రామాల నాయకులు ఉన్నారు.

చేయూత

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేద కుటుంబాలకు బుధవారం దాతలు ఆర్థిక సాయం అందజేశారు. మండల పరిధిలోని నవాబుపేట గ్రామానికి చెందిన బర్మాల భాషయ్య మృతి చెందాడు. దీంతో గ్రామ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బియ్యంతో పాటు నిత్యావసర సరుకులు, రూ.5 వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, అశోక్, రాజిరెడ్డి, చాంద్‌పాషా, సత్తిరెడ్డి, చంద్రయ్య, మహేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. దంతన్‌పల్లి గ్రామానికి చెందిన కన్నారం బుదయ్య కూతురు వివాహానికి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి, దొంతి గ్రామానికి చెందిన నర్సింలు కూతురు వివాహానికి బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు ఆర్థిక సాయం అందజేశారు.



ఆర్థికసాయం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఈ కార్యక్రమంలో సర్పంచ్ దుర్గేశ్, బీఆర్‌ఎస్ నాయకులు నాగేశ్వర్‌రావు, రమేశ్, వినయ్ తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

జిల్లా వ్యాప్తంగా బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయా గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దళిత నాయకులు మాట్లాడుతూ.. యువత అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలని తెలిపారు. ఆయన సేవలను కొనియాడారు.



నర్సాపూర్‌లో అంబేడ్కర్‌కు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు



కొల్చారం(నర్సాపూర్): రంగంపేటలో..



చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో..



రామాయంపేటలో ..



పెద్దశంకరంపేటలో..



తూప్రాన్‌లో ..



అల్లాదుర్గం(మెదక్): బహిరన్‌దిబ్బలో ..



చిన్నశంకరంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ..



వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేటలో..



నిజాంపేటలో ..